పల్లెల్లో గట్టు పంచాయితీలు

- పెండింగ్‌లో భూమి కొలతలు
- పట్టించుకోని సర్వేయర్లు
- ఇబ్బంది పడుతున్న రైతులు


చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామాల్లో సర్వేయర్లు సమయానికి భూమి కొలతలు చేపట్టకపోవడంతో గట్టు పంచాయితీలు ఎక్కువయ్యాయి. భూ కొలతల కోసం రైతులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం సర్వేయర్లు 45రోజులలోపు కొలతలు చేపట్టాలి. కానీ చాలా గ్రామాల్లో సమయానికి సర్వే చేయక పోవడంతో భూముల వద్ద గట్టు పంచాయితీలు రోజురోజుకూ అధికమవుతున్నాయి.

స్పందన కరువు

మండల పరిధిలోని విఠలాపూర్‌కు చెందిన మహిళా రైతు జూన్ 2022లో భూమి సర్వే కోసం జిల్లా సర్వేయర్ వద్ద డీడీ తీసి దరఖాస్తు చేసుకున్నారు. కాని నేటికీ స్పందన లేదు. ఇలానే చాలా మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోలీసుల వద్దకు రైతులు

మీసేవలో దరఖాస్తు చేసుకున్నా సర్వేయర్లు సకాలంలో కొలతలు చేపట్టక పోవడంతో రైతుల మధ్య గొడవలు పెరిగాయి. మూడేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్నా సర్వే చేయడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. నిత్యం గట్ల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. దీంతో రైతులు పోలీస్ స్టేషన్ బాటపట్టారు. భూముల పంచాయితీ పోలీసులకు తలనొప్పిగా మారింది. ఇప్పటి వరకు చిన్నకోడూరు మండలంలో 50 మంది రైతులు భూ సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

అధికారులు స్పందించాలి..

భూమి కొలతలపై మీసేవలో దరఖాస్తు చేసి రెండేళ్లు అవుతోంది. ఇప్పటి వరకు పట్టించుకోలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొలతలు చేపట్టాలి.

– జిల్ల మల్లవ్వ, చర్లఅంకిరెడ్డిపల్లి రైతు

వర్గల్ క్షేత్రంలో శనిత్రయోదశి మహోత్సవం

- నేడు ఉదయం నుంచే అభిషేకాలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు


కొలువైన శనేశ్వరుడు

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలోనే సుప్రసిద్ధమైన వర్గల్ క్షేత్రంలోని శనేశ్వరాలయం శనిత్రయోదశి మహోత్సవాలకు సిద్ధమైంది. శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకొని రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శనితైలాభిషేకాల కోసం తరలిరానున్నారు. శనివారం, త్రయోదశి రెండు కలిసివచ్చే అరుదైన రోజున శనేశ్వరునికి తిల, తైలాభిషేకం నిర్వహిస్తే దోషాలు తొలగి శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ పర్వదినం సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి శుక్రవారం తెలిపారు. వర్గల్ క్షేత్రానికి సికింద్రాబాద్ గురుద్వారా బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉందని చెప్పారు.

తెల్లవారుజాము నుంచే..

తెల్లవారుజాము 5.30ని.లకు గణపతిపూజ, శనేశ్వర మూలమంత్ర జపం, తర్పణం, హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోజంతా సామూహిక తైలాభిషేకాలు కొనసాగుతాయి. ఈ అభిషేకాలలో పాల్గొనడానికి భక్తులు రూ.250 చెల్లించవలసి ఉంటుంది. పూజాసామగ్రిని ఉచితంగా అందజేస్తారు.

క్లుప్తంగా

ఉద్యమానికి సిద్ధం కావాలి


ఎమ్మెల్సీ కవితను కలిసిన రాజ్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యేందుకు ఉద్యమించాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చినట్లు కుర్మ యువచైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ చెప్పారు. బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలుపై హైదరాబాద్‌లోని కవిత ఇంట్లో శుక్రవారం వివిధ బీసీ సంఘాల నాయకులతో చర్చించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలుపుకోవాలని కోరారు.

జాగిలాలతో తనిఖీలు


కిరాణా దుకాణంలో తనిఖీ..

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో భూంపల్లి పోలీసులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నివారణకు జాగిలాలతో వివిధ కిరాణా షాపులు, పాన్ షాపుల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో మత్తు పదార్థాలను చాక్లెట్‌ల రూపంలో అమ్మినా, కొన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్‌లను విక్రయించేవారి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో భూంపల్లి పోలీసులు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కల్యాణి



గజ్వేల్‌రూరల్: ఏబీవీపీ(అఖిల భారత విద్యార్థి పరిషత్) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గజ్వేల్ మండలం కొడకండ్లకు చెందిన కల్యాణి రెండోసారి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏబీవీపీలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్రశాఖకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

పోస్టర్ ఆవిష్కరణ


తొగుట(దుబ్బాక): జనగామలో నిర్వహించనున్న రజక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేశ్ పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన పోస్టర్‌లను శుక్రవారం తొగుటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు చట్టసభలతో పాటు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిథ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రజకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కరుణాకర్, నర్సింహులు, సత్తయ్య, సత్యనారాయణ, మహేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమాత్రే జపం


జపంలో పాల్గొన్న భక్తులు

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ అనంతమహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం శ్రీమాత్రే నమః సామూహిక జపం ఘనంగా జరిగింది. మాధవనంద సరస్వతి స్వామీజీ సంకల్పంతో గోధుమ గింజలతో జపం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రావిఆకుపై మన్మోహన్ చిత్రం



నారాయణఖేడ్: ఆర్థికవేత్తగా, ఆర్బీఐ గవర్నర్‌గా ,రాజ్యసభ సభ్యుడిగా, ఆర్థికశాఖ మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ భారతదేశానికి చేసిన సేవలు మరువలేనివి. ఆయన మరణం దేశానికి తీరనిలోటు. ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరుకుంటూ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండుశివకుమార్ రావిఆకుపై ఆయన చిత్రాన్ని మలచి నివాళులర్పించారు.

‘ఆర్థిక సహాయం’ అమలు ఎప్పుడు?

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్
- చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతి


సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): భూమిలేని ఉపాధి హామీ రైతుకూలీలకు యేడాదికి రూ.12వేల ఆర్థిక సహాయ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టాలని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పథకాన్ని వేగవంతంగా అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించినప్పటికీ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సైకిలాబ్, కొండల్, నాగయ్య, వెంకట్రాములు, కిరణ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన తేజకుమార్(11) పతంగి ఆడుకుంటూ స్థానిక మత్స్యవారి కుంటలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. చెరువులో గుర్రపు డెక్క ఉండడం వల్లే బాలుడు మృతి చెందాడని, ఇందుకు పరోక్షంగా కారణమైన మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌పై కేసులు నమోదు చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాలుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీడీఎస్‌యూ జిల్లా నూతన కమిటీని శుక్రవారం సిద్దిపేటలో ఏకగ్రీవంగా ఎంపికచేసినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా దేవులపల్లి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా గ్యార గణేశ్, ఉపాధ్యక్షుడిగా హరిప్రసాద్, సహాయ కార్యదర్శిగా కిరణ్, కోశాధికారిగా కుమార్, కమిటీ సభ్యులుగా సాయి కిరణ్, ఆనంద్, ప్రకాశ్, నితిన్‌ను ఎంపికచేసినట్టు తెలిపారు.

నిప్పు పెట్టిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న వెంకటయ్య

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): స్కూల్ వాహనాలకు నిప్పుపెట్టి దహనం చేసిన వారిని వెంటనే గుర్తించి శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీసులను ఆదేశించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో ఇటీవల గోల్కొండ మోడల్ స్కూల్‌కు చెందిన రెండు వాహనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన విషయం తెలుసుకొని ఆయన ట్రెస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రిన్సిపాల్ రవిని పరామర్శించారు. ట్రెస్మా తరఫున స్కూల్‌కు రూ.1,05,000 సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అండగా ఉంటామని ప్రిన్సిపాల్ రవికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ట్రెస్మా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి కుంట రాజు, జిల్లా నాయకుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

దూరంగా.. తహసీల్దార్ కార్యాలయం

- హుస్నాబాద్‌కు మార్చాలంటూ విజ్ఞప్తి


మాట్లాడుతున్న వేణుగోపాల్ రెడ్డి

హుస్నాబాద్: ప్రజల ఆకాంక్ష మేరకు తహసీల్దార్ కార్యాలయాన్ని హుస్నాబాద్‌లోనే ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. రైతులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయాన్ని పట్టణానికి దూరంలో నిర్మించిన సమీకృత భవనంలోకి మార్చారని, అక్కడ అధికారులు అందుబాటులో ఉండటంలేదన్నారు. దీంతో రైతులు, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పాత మున్సిపల్ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అందుకు మంత్రి పొన్నం కలెక్టర్‌ను ఆదేశించాలని కోరారు.

మెరుగైన సమాచార వ్యవస్థ అవసరం

- ఏసీపీ సతీశ్


ఏసీపీ సతీశ్‌కు మొక్కను అందజేసి స్వాగతం పలుకుతున్న ఎస్‌ఐ అభిలాష్

కోహెడ(హుస్నాబాద్): మెరుగైన సమాచార వ్యవస్థను ఏర్పరుచుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో వీపీఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలపై గౌరవ, మర్యాదలతో మెలగాలని, తక్షణంగా విచారణ జరిపి దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించి, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, కోహెడ ఎస్‌ఐ అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన

గజ్వేల్‌రూరల్: మహిళలు, యువత, స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సిద్దిపేట యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రతినిధి మహ్మద్ నాజీమ్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోగల వేములఘట్‌లో స్వయం ఉపాధి శిక్షణపై శుక్రవారం మహిళలు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు ఆయన మాట్లాడుతూ 18 నుంచి 40యేళ్ల వయసు కలిగిన పురుషులు, మహిళలకు వివిధరంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత యూనిఫామ్, కోర్సు మెటీరియల్‌తోపాటు టీ, భోజన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్‌తో పాటు అర్హులైన వారికి బ్యాంకు రుణాలు అందజేస్తామని, ఆసక్తికల వారు సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి

- ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు పీఎస్‌లో శుక్రవారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ గురించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, వాహనదారులు నిబంధనల మేరకు తమ వాహనాలకు నంబరు ప్లేట్‌లు అమర్చుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె

సిద్దిపేటజోన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో రెండు రోజుల టోకెన్ సమ్మె చేపట్టారు. స్థానిక జెడ్పీ కార్యాలయం వద్ద శిబిరాన్ని శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని, కనీస వేతనం రూ.26వేలు, ప్రమాద బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, మహేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలను స్మరించుకుందాం

బెజ్జంకి(సిద్దిపేట): వలసవాదుల నుంచి నిజాం దొరలతో పోరాడి అమరులైన కమ్యునిస్టుల త్యాగాలను స్మరించుకుందామని సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి రూపేశ్ పిలుపునిచ్చారు. సీపీఐ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని తిమ్మయపల్లె, పోతారం, గుగ్గిల్ల గ్రామాలలో శుక్రవారం పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్న చరిత్ర కమ్యూనిస్టులదేనన్నారు. మధు, శివకుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీనివాస్, మధు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్‌ఎల్‌టీఏ జిల్లా నేతల ఎంపిక


మహేంద్రారెడ్డి


సయ్యద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ సంఘం(ఎస్‌ఎల్‌టీఏ) జిల్లా అధ్యక్షులుగా పిన్నింటి మహేంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ సయ్యద్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేసినట్టు ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌ఎల్‌టీఏ ఎన్నికలను ఆన్‌లైన్‌లో నిర్వహించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



చేర్యాల(సిద్దిపేట): ఇటీవల మృతి చెందిన మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన కొడారి రాజమ్మ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందిగ రాకేశ్‌కృష్ణ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్క సంతోష్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు జింకల మోహన్, మేడిచెల్మి రాకేశ్, తడకపల్లి ఆశయ్య, జెడల ఎల్లయ్య, బందిగ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి

- మాజీ ప్రధాని మరణంపై సంతాపం
- నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు

భారత మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మరణంపై వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్ మరణం దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని, దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆయన మరణం తీరనిలోటు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక: మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరనిలోటని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మన్మోహన్ మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు ప్రధానమంత్రిగా దేశానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు.

గొప్ప ఆర్థిక సంస్కర్త

ఎంపీ రఘునందన్‌రావు



గొప్ప ఆర్థిక సంస్కర్తగా, భారత దేశానికి రెండు పర్యాయాలు ప్రధాన మంత్రిగా సేవలందించిన మన్మోహన్‌సింగ్ మరణం బాధాకరమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆయన మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దేశం గొప్పనేతను కోల్పోయిందన్నారు.


చేర్యాల(సిద్దిపేట): మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు


గజ్వేల్‌రూరల్‌లో..


దుబ్బాకటౌన్: రాయపోల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


హుస్నాబాద్: శివయ్య, చందు, పద్మ తదితరుల నివాళి


దుబ్బాకలో కాంగ్రెస్ నేత శ్రీనివాస్ తదితరులు


కొమురవెల్లి(సిద్దిపేట): శ్రీనివాస్, శ్రీనాథరెడ్డి తదితరుల నివాళి


దౌల్తాబాద్(దుబ్బాక): నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


వర్గల్(గజ్వేల్): మాజీ ఎంపీపీ మోహన్, రాజశేఖర్‌రెడ్డి ఇతర నాయకులు


మిరుదొడ్డి(దుబ్బాక): కొండాపూర్‌లో..


మద్దూరు(హుస్నాబాద్): బైరాన్‌పల్లిలో..


మర్కూక్‌లో..

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990